## కోరి ఇష్టపడి పెళ్ళిచేసుకున్నవారిలో అసంతృప్తి ఎక్కడ?

# పొత్తూరి పద్మిని కథ


# నాలో నేను

రైల్వేస్టేషన్! చాలా రద్దీగా ఉంది! ఎవరి హడావిడిలో వాళ్ళు ఉన్నారు! నాకెందుకో గుండెల్లో దిగులుగా ఉంది! ఆ దిగులుని, బాధని పైకి కనపరుస్తే నన్ను కంటి పాపలా చూసుకునే అన్నయ్య చాలా బాధపడతాడు! ఈ నెల రోజులు హాయిగా, స్వేచ్ఛగా, మూడు క్షణాల్లా గడిచిపోయాయి!

"ఏయ్ ... ఉమా! బాబుని చూస్తుండు నేను ఇప్పుడే వస్తాను!" వదినతో అన్నయ్య అంటుంటే ఈ లోకంలోకి వచ్చాను!

"ఏమిటి... రాధా! నేను నిన్న రాత్రినుంచి గమనిస్తున్నాను! ఏదో దిగులుగా వున్నావు?" భుజాన చెయ్యివేసి లాలనగా అడుగుతుంటే... భోరున ఏడ్వాలనిపించింది! కానీ కన్నీటిని గుండెల్లోనే దాచుకోవటానికి ప్రయత్నించాను!

పెద్దగా కూతపెడతూ రైలు పట్టాలు మీదగా ప్లాట్‌ఫాం మీదకి వచ్చేసింది! అన్నయ్య పెద్ద బిస్కెట్ ప్యాకెట్లు, అరటిపళ్ళతో హడావిడిగా వచ్చాడు. గబగబా వాటిని బుట్టలో సర్ది... సామాన్లు నా రిజర్వేషన్ సీటు దగ్గరికి చేర్చారు ఇద్దరు. బాబుతో ఎక్కి కూర్చున్నాను. అన్నయ్య ఆపేక్ష చూస్తుంటే నా కడుపు నిండిపోయింది. నిజానికి ఆడదానికి కావల్సినది అదే కదా! గుప్పెడు మనస్సుని గుండెకి చేర్చుకొని ఆదరణ చూపిస్తే చాలు! అదే ఆడదానికి పదివేలు! భర్త అయినా తండ్రి అయినా అన్నయ్య అయినా కొడుకైనా సరే అలాంటి ఆదరణ లభిస్తే... ఆ ఆదరణ లభిస్తే ఆ ఆడది పొందే ఆనందం అంతా ఇంతా కాదు!



"రాధా...! బాబు జాగ్రత్త...! వెళ్ళంగానే, లెటర్ వ్రాయి... వోయ్! అల్లుడా! టా.టా. చెప్పు!" వాడి బుగ్గని ముద్దు పెట్టుకుంటూ అంది వదిన. చిన్నారి చేతులతో టాటా చెప్పాడు బాబు!

"రాధా!... జాగ్రత్త! తొందరపడి దిగిపోకు బావగారు... వచ్చి నిన్ను రిసీవ్ చేసుకుంటారు..." అన్నయ్య అంటుంటే

ఆ మాటలు రైలు కదలికలో కలిసి పోయాయి! రైలు కనుమరుగయ్యేంతవరకు అన్నయ్య వదిన చెయ్యి ఊపుతూనే ఉన్నారు! రైలు వేగాన్ని అందుకుంది. అంతకంటే వేగంగా పరుగెడుతున్నాయి నా ఆలోచనలు!

నాకేమి లోటులేదు! ఆయనకి పెద్ద ఉద్యోగం నాల్గువేలు జీతం! ఇంట్లో కావలసినంత ఫర్నీచర్. ఫోను... టివి, ఫ్రిజ్... వో... ఇది లేదు అన్న వస్తువు లేకుండా అన్ని అమర్చారు ఆయన! నన్ను కోరి ఇష్టపడి... తన అందంతో ఆకట్టుకుని... నన్ను పెళ్ళి చేసుకున్నారు... మరి... ఎక్కడ లేదు... ఆనందం... నా జీవితంలో హు తెల్లారి లేచిన మొదలు కాఫీ దగ్గరనుంచి రాత్రి పడక సీను వరకూ మా ఇద్దరి మధ్య అభిప్రాయ భేదాలే ఆయన్ని సంతృప్తిపరచటానికి నేను చేసే ప్రయత్నాలు అన్ని విఫలాలే! ఒక్కొక్కసారి ఆయనకి దూరంగా వెళ్ళి పోదామనిపిస్తుంది! కానీ ఏదో విడదీయరాని బంధం... అడ్డుపడుతుంది... తెగించి... తెంపుచేసినా అక్కడ... అన్నయ్య అసలే చాలీచాలని జీతంతో తమ్ముళ్ళని, అమ్మని, వదినా, పిల్లలని సర్దుబాటు చెయ్యలేక సతమత మవుతున్నాడు! ఇక నేవెళ్ళి వాడిమీద భారం పెట్టటం భావ్యంకాదు! నాకా ఇప్పుడు ఉద్యోగాలు రావు! పైగా చిన్నచిన్న అభిప్రాయ భేదాలకే బంగారం లాంటి సంసారం కాలరాచి వచ్చిందన్న లోకనింద! నిజమే లోకులకి ఏం తెలుస్తుంది! ప్రతినిత్యం చిన్నచిన్న విషయాలే పెద్ద పెద్ద రాద్ధాంతాలు అవుతున్నా కన్నీటితో వాటిని చల్లార్చి... సర్దుకు పోతున్నానని ఈ రైలు పట్టాల్లా మేము బ్రతికున్నంతవరకూ కల్సి నడవాల్సిందే... కానీ ఈ పట్టాల్లా సమాంతర రేఖలు మా జీవితాలు! నాలాగే ఎంత మంది ఉన్నారో ఇలా సర్దుకుని పోయే స్త్రీలు. ఈ ప్రపంచంలో సడన్‌గా ఆగింది రైలు! బాబు ఆకలికోసం ఏడుస్తుంటే అరటిపండు పెట్టి... బిస్కెట్ చేతికిచ్చాను! అది తిని రైలు కదలికతో నా ఒడిలోకి నిద్రకి ఒరిగాడు! చిన్నగా వంగి వాడి బుగ్గని ముద్దు పెట్టుకున్నాను! రైలు ఆగింది! నేను చేరుకునే గమ్యస్థానానికి! వెతక్కూడదు అనుకుంటూనే నా కళ్ళు మళ్ళీ ఆయనకోసం వెతికాయి!

"ఏయ్... రాధా!..." చిరునవ్వుతో చెయ్యి ఊపుతున్న నా భర్త చూపులకి అందగాడే!

"ప్రయాణం... బాగా సాగిందా! అంత కులాసా నేనా? ఏరా... చిన్ని... అలా చిక్కిపోయావు..." ఆ బుగ్గా, ఈ బుగ్గా ముద్దు పెట్టుకుంటూ వాడిని నా చేతుల్లోంచి లాక్కున్నారు! కేరింతలు కొడుతూ వాళ్ళ నాన్న దగ్గరికి ఉరికాడు బాబు! టాక్సీలో సామాన్లు సర్ది ఎక్కి కూర్చున్నాం!

"ఏయ్... రాధా... ఏమిటే... ఆలోచిస్తున్నావు!" భుజాన చెయ్యి వేసి అడిగారు! ఎక్కడో... ఏ మూలనో నాకు ఆయనపై గల ప్రేమ నన్ను కదిలించింది! అందుకే ప్రతి ఆడది సర్దుకుపోతోంది నాలాగా! ఆయన కళ్ళల్లోకి చూసి ఏం సమాధానం చెప్పలేక అలసటగా ఆయన భుజాన ఒరిగాను!

*